




# ప్రజా న్యూస్ నెట్ వర్క్

దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 97,చీఫ్ ఎడిటర్ : వి. శివ కృష్ణ, వెల : 02,శనివారం, తేదీ : 08-08-2026


## చేనేత రంగానికి ఎల్లప్పుడూ ప్రభుత్వ మద్దతు- 'ఆత్మనిర్భర్ భారత్' కల సాకారానికి ఇదొక మూలస్తంభం




- ★ సోషల్ మీడియాలో మరో కొత్త వీడియో విడుదల చేసిన మోదీ
- ★ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపు
- ★ దేశంలోని నేతన్నల కుటుంబాలకు మద్దతివ్వాలని సూచన

## షేక్ హసీనా వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు.. బంగ్లాదేశ్‌కు స్పష్టం చేసిన భారత్..

- ❖ షేక్ హసీనా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం
- ❖ తన లక్ష్యం మళ్లీ అధికారంలోకి రావడం కాదని, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, అభివృద్ధి పునరుద్ధరించడమే



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆగస్టు 5న నిర్వహించిన మీడియా సమావేశం, ఆ దేశంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను తిరిగి బంగ్లాదేశ్ వెళ్లబోతున్నట్లు ప్రకటించడంతో పాటు మహ్మద్ యూనస్ పాలన, తనను పదవి నుంచి కిందకు దించడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే, న్యూఢిల్లీ నుంచి హసీనా చేసిన ఈ ప్రసంగంపై బంగ్లాదేశ్ తీవ్ర అభ్యంతరం తెలుపుతోంది. ఈ అంశం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను ప్రభావితం చేస్తుందని బంగ్లా వ్యాఖ్యానించింది. ఇదిలా ఉంటే, ఈ వ్యవహారంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. షేక్ హసీనా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఆ వ్యాఖ్యల్ని భారత్ సమర్థించడం లేదని తెలిపింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మిగతా..2లో

## ఒక దేశం మీద దాడి చేస్తే, 3 దేశాల మీద చేసినట్టే... పాక్, సౌదీ, టర్కీల మధ్య కీలక రక్షణ ఒప్పందం

- ❖ సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ దేశాల మధ్య శుక్రవారం రోజున ఒక కీలక రక్షణ ఒప్పందం కుదిరింది.
- ❖ ఈ ఒప్పందం ద్వారా మూడు దేశాల మధ్య సైనిక సహకారం బలోపేతం కానుంది.



ఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో ఆందోళన చెందుతున్న అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, పాకిస్తాన్, టర్కీ శుక్రవారం మక్కాలో ఒక సంయుక్త రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశంలో సౌదీ అరేబియాలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌లు పాల్గొన్నారు. ఈ ముగ్గురి సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం మూడు దేశాల మధ్య సైనిక సహకారాన్ని బలోపేతం చేయనుంది. ఇందులో ఏ ఒక్క దేశంపై దాడి జరిగిన మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణించనున్నారు. మిగతా..2లో

## రాష్ట్రంలో వర్షాల కోసం వరుణ యాగం.




- ★ 10న నాగార్జునసాగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పూర్ణాహుతి.
- ★ కృష్ణా, గోదావరి జలకళ కోసం ప్రత్యేక పూజలు

హైదరాబాద్, ఆగస్టు 07 : రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సుభిక్షంగా పండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారు. వరుసగా వాయిదా పడుతున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**10న నాగార్జునసాగర్‌లో మహా యాగం**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు సంప్రదించి నిర్ణయించిన

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- ● జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- ● నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- ● రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్






హైదరాబాద్ : జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. మిగతా..2లో

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

**చేనేత రంగానికి రూ.980 కోట్లు విడుదల**

- ○ పీపుల్స్ ప్లాజాలో వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తుమ్మల
- ○ రైతన్నకు, నేతన్నకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి
- ○ 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామన్న మంత్రి



హైదరాబాద్: చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను మిగతా..2లో

## వెలిగొండ ప్రాజెక్టుపై కీలక ఆదేశాలు.. ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు





కృష్ణా జలాలను తరలించేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

కొల్లం వాగు నుంచి టన్నెల్స్ ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు అవసరమైన అప్రోచ్ ఛానెల్ క్లియరింగ్ పూర్తైందన్నారు.

అమరావతి: వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, ఈ నెల మూడో వారంలోనే నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలించేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి మిగతా..2లో

## తెలంగాణ ప్రాజెక్టులకు చట్టబద్ధ అనుమతులపై సమీక్ష సరికాదు.జలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ



కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమీక్షించడం సరికాదన్నారు.

తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్,

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు పొందిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించే అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు జలశక్తి మంత్రికి, సెక్రటరీకి రాసిన లేఖను విడుదల చేశారు . కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను గోదావరి నదీ యాజమాన్య మిగతా..2లో

## దేశంలో అత్యుత్తమ జోన్‌గా విశాఖ జోన్.. రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు





- ★ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఉత్తమ జోన్‌గా నిలిచిందన్న రైల్వే శాఖ
- ★ ఏపీలో ప్రస్తుతం రూ. 54 వేల కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ★ మరో రూ.71 వేల కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయన్న రైల్వే శాఖ

అమరావతి : విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.

## చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం.. అందుకు ఈ పథకమే నిదర్శనం

- ▶▶ చీరాలలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ▶▶ 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం
- ▶▶ ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి
- ▶▶ చేనేత వర్గాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్, పెన్షన్ పథకాలను వివరించిన సీఎం
- ▶▶ చీరాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ




అమరావతి : రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం కొత్తపేట గ్రామంలో 'నేతన్న సేవలో' అనే కొత్త పథకాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 179 కోట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకునే ఆగస్టు 7వ తేదీని మరపురాని రోజుగా మార్చాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా, చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామనడానికి 'నేతన్న సేవలో' పథకమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది భారతీయ సంస్కృతికి, దేశం గర్వించదగ్గ కళకు ప్రతీక అని కొనియాడారు. ఒకప్పుడు చేనేత ఉత్పత్తులతో 'మినీ ముంబై'గా పేరుగాంచిన చీరాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత వర్గాల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ భరోసా కింద రూ. 4,000 పింఛను అందిస్తున్నామని, దీని ద్వారా 85 వేల మందికి ఏటా రూ. 420 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని,

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?




- ● డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- ● లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- ●● డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- ● విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- ● విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

అమరావతి : డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ,

# గాజులరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్**

గాజులరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవడం జరిగినది.

ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించడం జరిగింది.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను.

# ప్రగతి నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్ ' :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 276వ డివిజన్ ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని, బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి చేస్తున్న సేవలను కొనియాడుతూ, ప్రజలకు మరింత చేరువై కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, స్టేట్ మాజీ జనరల్ సెక్రటరీ షేక్ రఫియా బేగం, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, వరగాని వాసు, సురేందర్ యాదవ్, రమేష్, రఫత్, ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అన్యాయం జరిగిన కార్మికులకు అండగా నిలుస్తా

## బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్ :**

కుత్బుల్లాపూర్ జెఆర్ ఇన్ఫ్రా ఆర్ఎంసి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో ఓనర్ జనార్ధన్ రావు, దగ్గర గత కొన్ని నెలల నుంచి కార్మికుడు మహేష్ కుమార్ సింగ్ పనిచేసేవారు, కార్మికుడు మహేష్ కుమార్ ఓనర్ జనార్ధన్ రావు అక్టోబర్ నెల వేతనం ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో, కార్మికుల హక్కులను కాపాడేందుకు నిరంతర పోరాటం చేపడుతున్నాడని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బి ఆర్ టి యు కార్మిక నాయకుడు రవి కార్యాలయం వద్దకు వెళ్లి మహేష్ కుమార్ సింగ్ కి జరిగిన అన్యాయం వివరించారు, వెంటనే స్పందించిన రవి హుటాహుటిన ఓనర్ జనార్ధన్ రావు తో మాట్లాడి మహేష్ కు రావలసిన అక్టోబర్ నెల వేతనం కార్మికుడు మహేష్ కుమార్ కు చెక్ రూపంలో ఆ వేతనం ఇవ్వడం జరిగింది కార్మికుడు మహేష్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# సోమశిలలో రిటైనింగ్ వాల్ నిర్మాణం వేగవంతం



**అనంతసాగరం ఆగస్టు 7 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :**

నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని ప్రాజెక్టు శివాలయం సమీపంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 88 అడుగుల ఎత్తుతో, రూ.88 లక్షల వ్యయంతో ఈ రక్షణ గోడను నిర్మిస్తున్నారు.నిర్మాణ పనులను ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. శ్రీనివాస్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు సూచించారు. ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను అనుసరిస్తూ పటిష్ఠంగా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.భారీ వర్షాలు, వరదలు లేదా ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినా ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా అత్యంత దృఢంగా రిటైనింగ్ వాల్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

# శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ హ్యాండ్‌బాల్ సందడి



**పాయకరావుపేట, ఆగస్టు 7 (ప్రజా న్యూస్ నెట్వర్క్):** శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల వేదికగా సీబీఎస్ఈ సౌత్ జోన్--1 హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సీబీఎస్ఈ పాఠశాలల నుంచి సుమారు 2,500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. అండర్--14, అండర్--17, అండర్--19 బాలబాలికల విభాగాల్లో నాలుగు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి.పోటీలను ప్రముఖ కెమికల్ ఇంజినీరింగ్ శాస్త్రవేత్త, ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్, తణుకు సంస్థ రిటైర్డ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) ఎల్. నగేష్ కుమార్ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ఏలూరుకు చెందిన సర్ సి.ఆర్.రెడ్డి పబ్లిక్ స్కూల్ జట్టు, తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన పి.ఎస్.బి.బి. మిలీనియం స్కూల్ జట్టుతో తలపడగా, కోయంబత్తూరు జట్టు విజయం సాధించింది.ఈ సందర్భంగా ఎల్. నగేష్ కుమార్ మాట్లాడుతూ, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే వేదికపై క్రీడల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. పోటీల్లో పాల్గొంటున్న ప్రతి విద్యార్థి విజేతేనని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించేవారే నిజమైన విజేతలని అన్నారు.రాత్రి వేళల్లోనూ పోటీలు కొనసాగించేలా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ప్రిన్సిపల్ రవి, సీబీఎస్ఈ పర్యవేక్షకులు స్వామి, వివిధ రాష్ట్రాలకు చెందిన సీబీఎస్ఈ పాఠశాలల క్రీడాకారులు, జట్టు కోచ్‌లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల ఆత్మగౌరవ మహా ధర్నాను విజయవంతం చేయాలి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**

ఎస్సీ, ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్ సాధన కోసం ఈనెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఎస్సీల ఆత్మగౌరవ మహా ధర్నాను విజయవంతం చేయాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హసేన్ పిలుపునిచ్చారు. తెలంగాణలోని 59 ఎస్సీ కులాల సోదర సోదరీమణులు ఐక్యంగా ముందుకు వచ్చి ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మేధావులు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ హక్కుల కోసం గళమెత్తాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రకటించిన డిక్లరేషన్‌లోని హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తల్లమల్ల హసేన్ విమర్శించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తే ఎస్సీ కులాలన్నీ ఐక్యంగా ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకొచ్చి తమ హక్కులను సాధించుకుంటాయని స్పష్టం చేశారు.

# విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు రెడ్డి సంక్షేమ సంఘం సేవా కార్యక్రమం



**తుని ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తుని--పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నవరంలోని శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.22 వేల విలువైన 20 ట్రంకు పెట్టెలు, 10 బట్టల బాస్కెట్లు, 10 స్టీలు బాక్సులను అందజేశారు.సంఘం ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు ఎం.వి.ఆర్. రాజారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు కర్రి త్రినాధ్ రెడ్డి పాల్గొన్నారు. తుని--పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరెన్నో సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కె. కిషోర్ రెడ్డి, ఎస్. లక్ష్మీనారాయణరెడ్డి, పి. శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి కె.వి. రామలింగారెడ్డి, కోశాధికారి టి. సోమనాథ్ రెడ్డి, కె. నారాయణరెడ్డి, కె. రామారెడ్డి, ఎం. శివారెడ్డి, టి. నాగిరెడ్డి, ఎస్. సురేష్ రెడ్డి, కె. అజయ్ రెడ్డి, సిహెచ్. మణికంఠ రెడ్డి, ఎన్. రామకృష్ణారెడ్డి, ఎస్. మణికంఠ రెడ్డి, కె. సూరెడ్డి, ఎం. వెంకటరెడ్డి, సిహెచ్. శేషారెడ్డి, డి. ఆనంద రెడ్డి, కె. ప్రసాద రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, దొరారెడ్డి తదితర సభ్యులు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ఎమ్మెల్యే యనమల దివ్య



**తుని, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తుని మండలం కోళ్లఫారం కాలనీలోని కస్తూర్బా పాఠశాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య సందర్శించి విద్యార్థులకు దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యా ప్రమాణాలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వివిధ విద్యా ప్రణాళికలను అమలు చేస్తోందని యనమల దివ్య తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.కస్తూర్బా పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాస వాతావరణం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత యనమల రాజేష్, మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు తమరాన వరలక్ష్మి రామకృష్ణ, తమరాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం: హోంమంత్రి అనిత



**పాయకరావుపేట, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్:**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పాయకరావుపేటలో నిర్వహించిన 'నేతన్న సేవలో' కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. చేనేత కార్మికులు తయారు చేసిన చీరను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ చేనేత వృత్తి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళానైపుణ్యాలకు ప్రతిబింబంగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా చేనేత కళాకారులు తమ నైపుణ్యంతో దేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాకు చేనేత రంగంలో ప్రత్యేక స్థానం ఉందని, ఇక్కడి నేతన్నలు తయారు చేస్తున్న వస్త్రాలు నాణ్యతతో పాటు సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అనిత చెప్పారు. స్వంత మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి 'నేతన్న సేవలో' పథకం కింద ఈ ఏడాది నుంచి రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామని వివరించారు.చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందని, నేతన్నల జీవనోపాధిని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని హోంమంత్రి పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం చేనేత ఉద్యమం నుంచే ఆవిర్భవించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలోని అనేక చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.చేనేత రంగంలో సుమారు 70 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారని, వారి ఆర్థిక సాధికారతకు ఈ రంగం కీలకంగా ఉందని తెలిపారు. చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సులోనే పింఛన్ అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.గత ప్రభుత్వ పాలనపై హోంమంత్రి విమర్శలు చేస్తూ, గతంలో అన్నా క్యాంటీన్లను మూసివేశారని, ప్రజా వేదికను కూల్చివేశారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అనిత తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, స్థానిక అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.

# మంత్రి ఉత్తమ్ నియోజకవర్గ సమస్యలను గాలికొదిలేశారు: ఒంటెద్దు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్**

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి తీవ్రంగా విమర్శించారు . నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ వాటి పరిష్కారంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తరచూ విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన పైపుల లీకేజీల కారణంగా సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మరోవైపు పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు నెలకొన్నాయని, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్యుత్, సాగునీరు, తాగునీరు, వ్యవసాయ అవసరాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. నీటిపారుదల శాఖను నిర్వహిస్తున్న మంత్రి నియోజకవర్గంలోనే లిఫ్ట్ ఇరిగేషన్ పైపుల లీకేజీల సమస్యలు కొనసాగడం ఏమిటని ప్రశ్నించారు. పౌరసరఫరాల శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ రైతులకు, ప్రజలకు అవసరమైన ఎరువులు, నిత్యావసర సరుకుల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం పదవిలో కొనసాగడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి విద్యుత్ కోతలు, సాగునీటి లీకేజీలు, తాగునీటి సమస్యలు, ఎరువుల కొరత తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ప్రజల తరపున బీఆర్ఎస్ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని ఒంటెద్దు నర్సింహారెడ్డి హెచ్చరించారు.

# విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ రిలే నిరాహార దీక్షలు ఘన ప్రారంభం



**ప్రజా న్యూస్ ఆగస్టు 07 :విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ శాసనసభ్యులు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆలోచనకు అనుగుణంగా, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఈ రోజు ప్రకాశ్ నగర్ ఏడుగుళ్ల వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముందు వైఎస్సార్‌సీపీ గ్రేటర్ విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ జహీర్ అహ్మద్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, అలాగే మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులు, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం తెలుపుతూ రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులు మరియు నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని, వారి హక్కుల సాధన కోసం ఈ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# పాట రూపంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**

ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ ఆకుల రజని వినూత్నంగా పాట రూపంలో తల్లిపాలలో ఉన్న పోషక విలువలు, శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, వ్యాధి నిరోధక శక్తి గురించి తల్లులకు వివరించారు. ముఖ్యంగా ప్రసవం అనంతరం లభించే ముర్రుపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అధికంగా ఉంటాయని, తల్లిపాలు శిశువుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పాట ద్వారా అవగాహన కల్పించారు. తల్లులు, గర్భిణీలు తల్లిపాల ప్రాధాన్యతను అర్థం చేసుకుని శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా వెంకటమ్మతో పాటు నాగమణి, సమీనా, కావ్య, నవ్య, నాగలక్ష్మి, త్రివేణి, రాధా తదితర గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పాలిచ్చే తల్లులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో 510 మందికి ఆర్థిక చేయూత



**తుని, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్:**

తుని నియోజకవర్గంలో నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించడంలో ప్రభుత్వ విప్ యనమల దివ్య కృషి కొనసాగుతోందని పార్టీ నాయకులు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ అర్హతే ప్రామాణికంగా ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చుల కోసం తుని నియోజకవర్గానికి చెందిన 510 మంది నిరుపేదలకు సుమారు రూ.4 కోట్ల మేర ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. తాజాగా తుని మండలం తేటగుంటలోని క్యాంపు కార్యాలయంలో 80 మంది లబ్ధిదారులకు రూ.59 లక్షల 32 వేల విలువైన చెక్కులను యనమల దివ్య అందజేశారు.తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి యనమల దివ్య లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ తుని నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ



**పాయకరావుపేట, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్:**

పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను హోం మంత్రి వంగలపూడి అనిత అందజేశారు. మొత్తం 33 మంది లబ్ధిదారులకు రూ.31,51,284 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

శనివారం 08-08-2026

## అటవీ సంరక్షణకు పోలీస్, అటవీశాఖల సమన్వయం తప్పనిసరి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
సూర్యాపేట జిల్లాలో అటవీ సంపద పరిరక్షణకు పోలీస్, అటవీశాఖ అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా ఎస్పీ కే. నరసింహ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ అడవులను నాశనం చేయకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అడవుల విస్తీర్ణం పెరిగితేనే కరువు వంటి తీవ్ర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలో అటవీ భూముల అక్రమ ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా, పోడు భూములకు సంబంధించి ధర్నాలు, ఆందోళనలు జరిగే అవకాశం ఉన్నా అటవీ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల సహకారం తీసుకుంటూ సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో తరచూ సమస్యలు సృష్టించే వ్యక్తులను ముందుగానే గుర్తించి వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ సంపదను కాపాడేందుకు రెండు శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే పోలీస్, అటవీశాఖ పరిధిలో నమోదైన పాత కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి దామోదర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఆదిత్య, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా కె.లత బాధ్యతల స్వీకరణ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీమతి కె.లత అదనపు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆమెకు గతంలోనూ జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. ఆ సమయంలో సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందిన కె.లత మరోసారి బాధ్యతలు చేపట్టడంపై అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎస్సీ సంక్షేమ పథకాల అమలుతో పాటు అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా చేరేలా కృషి చేస్తారని పలువురు ఆకాంక్షించారు.

## కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలు ఐక్యం కావాలి : పల్లె వెంకటరెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్**
కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని శాంతి స్థూపం వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శీను అధ్యక్షతన నిర్వహించిన జీపు జాత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందని, క్విట్ ఇండియా ఉద్యమానికి నాంది పలికిన రోజును స్ఫూర్తిగా తీసుకుని రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని అన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతాంగానికి స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రైతులు ఐక్యంగా నిర్వహించిన ఉద్యమాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని గుర్తు చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దుర్గి బ్రహ్మం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోసనబోయిన హుస్సేన్, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఎలక సోమయ్య గౌడ్, రైతు సంఘం పట్టణ కార్యదర్శి రేపాకుల మురళి, చిన్నం వీరమల్లు, ఇంటి తిరపయ్య, కొమర రాజు, చింతకాయల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమితి కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడిగా బొలిశెట్టి కృష్ణయ్య



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్**
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పనిచేసిన సీనియర్ ఉద్యమకారుడు బొలిశెట్టి కృష్ణయ్యను తెలంగాణ ఉద్యమకారుల సమితి (టి. యు. యస్ ) కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొడేటి శంకర్ గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బొలిశెట్టి కృష్ణయ్య అందించిన సేవలు, ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్ర నాయకత్వం పేర్కొంది. నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను గుర్తించి, వారి హక్కులు, సంక్షేమం కోసం మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన బొలిశెట్టి కృష్ణయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన సమితి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. సమితి ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ఉద్యమకారులను సమన్వయం చేసుకుంటూ వారి సమస్యలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల సూర్యాపేట జిల్లా, కోదాడ నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బొలిశెట్టి కృష్ణయ్యకు అభినందనలు తెలిపారు.

## తలంపులమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కానుకల సమర్పణ



**కాకినాడ జిల్లా తుని, ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తుని అసెంబ్లీ నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ డాక్టర్ వెలగా వెంకట కృష్ణారావు-- సత్యవేణి దంపతులు, టీడీపీ సీనియర్ నాయకులు వెలగా వెంకట గంగాధర్ రంగనాయకులు, వెంకట పద్మావతి దంపతులు లోవ దేవస్థానంలోని తలంపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరను సమర్పించి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.నాయకుల రాక సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. దర్శనం అనంతరం ఆలయ కమిటీ తరపున తీర్థప్రసాదాలు అందజేశారు.

## 62వ వార్డులో ఫ్రైడే – డ్రైడే..

**ప్రజాన్యూస్, ఆగస్టు 07 : విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.**
జీవీఎంసీ వెస్ట్ జోన్ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో శుక్రవారం స్థానిక మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే – డ్రైడే జరిగింది. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ మలేరియా ఇనిస్పెక్టర్ డి రవికుమార్, జిల్లా మలేరియా విభాగం హెల్త్ సూపర్ వైజర్ బి సూర్యనారాయణ, వార్డు శానిటరీ ఇనిస్పెక్టర్ నవరత్నంలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్ గునియా తదితర సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మంచినీరు, వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గృహాలలో ఉన్న ఫ్రిజ్ వెనుక వైపు గల డ్రాప్ బాక్స్, పూల కుండీల క్రింద ప్లేట్లు, మనీప్లాంట్లు, కూలర్లు, సిమెంట్ కుండీలు, డ్రమ్ములు, డాబాలపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను నిత్యం గమనిస్తూ ఉండాలని రెండు రోజులు కంటే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఇంటి పరిసరాలలో త్రాగి పడేసిన కొబ్బరి బొండాలు, డిస్పోజల్ గ్లాసులు, మూతలు లేని సీసాలు, టైర్లు తదితర పనికిరాని వస్తువులను తొలగించాలన్నారు. వర్షాభావాన్ని దృష్టిలో పెట్టుకుని అటకలపైన, డాబాలపైన పనికిరాని సామాన్లు ఉంటే వెంటనే వాటిని తీసివేయాలన్నారు. మంచి నీరే డెంగ్యూ, మలేరియా వంటి దోమలకు ఆహారమని ఆ నీటిని దోమలకు అందకుండా చేస్తే దోమలు వృద్ధి చెందలేవన్నారు. ప్రతీ శుక్రవారం, మంగళవారం అందరూ తమ గృహాలలో ఉన్న నీటి నిల్వలను తొలగించి అయా పాత్రలను కొంత సమయం ఆరబెట్టిన తరువాత వాటిలో తాజా మంచినీటిని నింపుకోవాలన్నారు. పైన సూచించిన జాగ్రత్తలను ప్రతీ ఒక్కరూ పాటించి సీజనల్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్ వైజర్ డి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ బ్రహ్మాజీ, శానిటరీ సూపర్ వైజర్ గంట్యాడ గోవింద్, మలేరియా సిబ్బంది రత్నం, దేవి, వంశీ, ఆశా కార్యకర్తలు జయలక్ష్మి, సుందరమణి, రాణి, విజయలక్ష్మి తదితరులతో పాటు అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.




## చింతల్ సంజీవయ్య నగర్‌లో శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 9వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్వర్క్**
చింతల్‌లోని సంజీవయ్య నగర్‌లో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయం 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు, దీవెనలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయ కమిటీ సభ్యుడు విజయ్ గుప్తా గడ్డం రాజేందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు స్వాతి రాజేందర్ రెడ్డి, యాదగిరి పెంటయ్య ముదిరాజ్ సూరా రవీందర్ గౌడ్ విజయేందర్ గుప్తా ఉమామహేశ్వర్, కృష్ణమ నాయుడు, ఉమేష్ జానయ్య కృష్ణ కుమార్ సిహెచ్ శ్రీనివాస్ గుప్త, కిరణ్ యాదవ్, నాంపల్లి విజయ్ రాజు గుప్తా, రాజమౌళి ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు



## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణికంగా రూపొందించాలి: భారతి హోళీకేరి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్యతా ప్రమాణాలతో రూపొందించాలని జనగణన సంచాలకులు భారతి హోళీకేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై పలు కీలక సూచనలు చేశారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నామని, ఇందులో జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరచనున్నట్లు భారతి హోళీకేరి తెలిపారు. భవిష్యత్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలు, జనగణన విశ్లేషణలకు ఈ హ్యాండ్‌బుక్ కీలక ఆధార పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖ నుంచి అధికారిక రికార్డుల ఆధారంగా పూర్తి సమాచారాన్ని సేకరించి, రెవెన్యూ గ్రామం నుంచి పట్టణ స్థాయి వరకు వివరాలను నమోదు చేయాలని సూచించారు. 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు,




శాఖల సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆగస్టు 10 నుంచి 21 వరకు సమాచార సేకరణ, ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు సమాచార నమోదు, పరస్పర పరిశీలన, సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి స్థాయి సమాచార ధృవీకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పట్టికలోని వివరాలు ఖచ్చితంగా ఉండేలా, ఖాళీ గడులు, పునరావృత నమోదులు, గణాంకాల్లో వ్యత్యాసాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల పేర్లు అధికారిక రెవెన్యూ రికార్డుల ప్రకారమే నమోదు చేయాలని, నిర్దేశించిన నమూనా పట్టికలను మాత్రమే ఉపయోగించాలని, టైపింగ్ పొరపాట్లకు అవకాశం లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి సమాచారం ప్రామాణికమైనది, ఖచ్చితమైనది, తాజాదైనది, సంపూర్ణమైనది, ఏకరూపమైనది అనే ఐదు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా సమగ్ర పరిచయంలో భౌగోళిక స్థితి, పరిపాలనా నిర్మాణం, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక పరిస్థితులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి సూచికలు తదితర అంశాలను పొందుపరచాలని సూచించారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రతి శాఖకు బాధ్యతలు కేటాయించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జనగణన సంచాలకులు ఇచ్చిన అన్ని సూచనలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల నుంచి నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరించి, పూర్తిస్థాయిలో పరిశీలించి, నిర్ణీత కాలపట్టికలోపు రాష్ట్ర కార్యాలయానికి పంపేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి. హరి సింగ్, సీపీఓ కిషన్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్ BUSINESS

### పీపీఎఫ్ వ్యవధి ముగుస్తుంటే...

మన దేశంలో అందుబాటులో ఉన్న సురక్షిత పొదుపు పథకంలో అత్యంత విశ్వసనీయమైన దీర్ఘకాలిక పథకం...ప్రజా భవిష్య నిధి(పీపీఎఫ్). ఈ ఖాతా 15 ఏళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకోవడం అనేది ఒక ముఖ్యమైన మైలురాయి. పన్ను రహితంగా భారీ మొత్తం చేతికి అందే ఈ నిధిని ఎలా నిర్వహించాలనేది భవిష్యత్తు అవసరాలపై ఆధారపడి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత ఖాతాను పూర్తిగా రద్దు చేసుకోవడం కాకుండా, మదుపరుల ముందు మూడు స్పష్టమైన ఎంపికలూ అందుబాటులో ఉన్నాయి..

సంపూర్ణ ఉపసంహరణ: ఖాతా 15 ఏళ్లు పూర్తి కాగానే, వడ్డీతో సహాజమైన మొత్తం నిధిని ఉపసంహరించుకోవచ్చు. పిల్లల ఉన్నత చదువులు, వివాహం లేదా ఇల్లు కొనుగోలు వంటి తక్షణ ఆర్థిక అవసరాలు ఉన్నవారికి ఇది సరైన మార్గం. అంతేకాకుండా, ఈ నిధిని ఇతర లాభదాయకమైన పెట్టుబడి సాధనాల్లోకి మళ్లించాలనుకునే వారూ ఈ ఎంపికను ఎంచుకోవచ్చు.

కొత్త పెట్టుబడులతో పొడిగింపు: తక్షణ నగదు అవసరం లేని వారు అయిదేళ్ల వ్యవధి చొప్పున ఖాతాను పొడిగించుకోవచ్చు. ఇందులో యథావిధిగా కొత్త పెట్టుబడులు చేయొచ్చు. దీనివల్ల చక్రవడ్డీ ప్రభావంతో నిధి మరింత వేగంగా పెరుగుతుంది. మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నిర్ణయించే స్థిరమైన వడ్డీ రేటు ఇక్కడ లభిస్తుంది. కాబట్టి, పదవీ విరమణ కోసం పెద్ద మొత్తాన్ని సమకూర్చుకోవాలని భావించే వారు దీన్ని పరిశీలించవచ్చు.

నగదు జమ చేయకుండా: కొత్తగా నగదు జమ చేయలేం అనుకునే వారు, కేవలం ఉన్న నిధిని ఖాతాలోనే ఉంచి, వడ్డీని పొందే సౌకర్యమూ ఉంది. ఇందులో క్రమం తప్పకుండా




డిపాజిట్లు చేయాల్సిన అవసరం లేదు. ఖాతాలోని నిల్వపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించే వడ్డీ రేటు వర్తిస్తూనే ఉంటుంది. సురక్షితమైన ప్రభుత్వ హామీగల సాధనాల్లో తమ నిధిని దాచుకోవాలని భావించే వారికి ఇది అనుకూలం.

**పన్ను ప్రయోజనాలతో..**
పీపీఎఫ్ పెట్టుబడులకు పన్ను మినహాయింపు ఉంటుంది. వచ్చే వడ్డీకి పన్ను ఉండదు. గడువు తీరిన తర్వాత తీసుకునే మొత్తం నిధిపైనా ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఈ మూడు దశల్లోనూ ఆదాయపు పన్ను నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుందన్నమాట. ఇది సాధారణ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే అధిక లాభదాయకతను అందిస్తుంది. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ రేట్లను సమీక్షిస్తుంటుంది. ఈ మార్పులు పెట్టుబడిదారుల దీర్ఘకాలిక ద్రవ్యోల్బణ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయో లేదా అన్నది గమనిస్తూ ఉండాలి. మీ పీపీఎఫ్ ఖాతా గడువు సమీపిస్తుంటే.. వెంటనే పోస్టాఫీసుకెళ్లి మీరు ఏం చేయాలనుకుంటున్నారో చెప్పండి. ఫారం హెచ్, ఇతర అవసరమైన పత్రాలు సమర్పించండి.

### అదరగొట్టిన ఎల్ఐసీ.. లాభం రూ.13,492 కోట్లు

ఢిల్లీ: ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.13,492 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.10,987 కోట్ల నికర లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధి నమోదైంది. ఎల్ఐసీ మొత్తం ఆదాయం రూ.2,37,848 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయంలో రూ.2.22 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఎల్ఐసీ తన




రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో తొలి ఏడాది ప్రీమియంలు వసూళ్లు రూ.7,525 కోట్ల నుంచి రూ.9217 కోట్లకు పెరిగాయని ఎల్ఐసీ తెలిపింది. రెన్యువల్ ప్రీమియం వసూళ్లు రూ.59,885 కోట్ల నుంచి రూ.61,833 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. సింగిల్ ప్రీమియం ద్వారా రూ.56,369 కోట్లు వసూలైనట్లు తెలిపింది. మొత్తం ఖర్చులు రూ.2.11 లక్షల కోట్ల నుంచి రూ.2.25 లక్షల కోట్లకు పెరిగినట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. తొలి త్రైమాసికంలో వ్యక్తిగత సెగ్మెంట్‌లో 31.02 లక్షల పాలసీలు విక్రయించినట్లు ఎల్ఐసీ తెలిపింది. లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో తొలి ఏడాది ప్రీమియం ఆదాయం విషయంలో ఎల్ఐసీ 60.1 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉందని కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి వెల్లడించారు.

### అప్పర్‌లేయర్ NBFCగా టాటా సన్స్.. లిస్టింగ్‌పై రాని స్పష్టత!

ముంబయి: టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తించింది. దీంతో పాటు మరో 16 కంపెనీలనూ అప్పర్ లేయర్ జాబితాలో చేర్చింది. ప్రభుత్వరంగానికి చెందిన ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ, హడ్కోతో పాటు, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్ ఆ జాబితాలో ఉన్నాయి. జూన్ 1 నుంచి వచ్చిన నిబంధనల ప్రకారం..రూ.లక్ష కోట్లు ఆస్తులు కలిగిన ఎన్‌బీఎఫ్‌సీని అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా పరిగణిస్తారు. 2026 మార్చి నాటికి టాటా సన్స్ ఆస్తుల విలువ రూ.2 లక్షల కోట్లకు పైబడి ఉండడంతో దీన్ని అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తించింది. ఇలా గుర్తింపు పొందిన కంపెనీ మూడేళ్లలోపు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సి ఉంటుంది. టాటా గ్రూప్ కంపెనీలకు ఎన్‌బీఎఫ్‌సీ కేటగిరీలో టాటా సన్స్ ప్రధాన పెట్టుబడి కంపెనీగా ఉంది. లిస్టింగ్ నుంచి తప్పించుకోవడం కోసం పెట్టుబడి కంపెనీగా డీరిజిస్టర్ చేయాలంటూ టాటా సన్స్ గతంలో ఆర్‌బీఐకి దరఖాస్తు చేసుకుంది. ఈ దరఖాస్తు ఇంకా పరిశీలనలోనే ఉందని ఆర్‌బీఐ తాజాగా పేర్కొంది. దీనికి ఆర్‌బీఐ ఆమోదించేది లేనిదీ దాన్ని బట్టి లిస్టింగ్ ఆధారపడి ఉంటుంది. లిస్టింగ్‌పై తలోమాట: టాటాసన్స్ లిస్టింగ్ విషయంలో టాటా ట్రస్ట్స్‌లోనే విభేదాలు ఉన్నాయి. ఛైర్మన్ నోయల్ టాటా లిస్టింగ్‌కు వ్యతిరేకంగా ఉండగా.. వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ మద్దతుగా ఉన్నారు. అప్పులు చెల్లించుకోవడం కోసం ఎప్పటి నుంచో టాటా సన్స్




లిస్టింగ్‌ను ఎస్‌పీ గ్రూప్ డిమాండ్ చేస్తూ వస్తోంది. లిస్టింగ్ వల్ల సంస్థపై ట్రస్ట్ నియంత్రణ తగ్గి, బయటి వ్యక్తుల జోక్యం పెరుగుతుందనేది ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా, మరికొందరు ట్రస్టీల ఆందోళన.

### యూపీఐపై ఛార్జీలు.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ఢిల్లీ: యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించడానికి ఉద్దేశించిన 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007' సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇక డిజిటల్ లావాదేవీలపై బ్యాంకులతో పాటు ఇతర ఫిన్‌టెక్ సంస్థలకు ఛార్జీలు వసూలు చేసే అధికారం ఈ బిల్లు కల్పించనుంది. ఎలాంటి చర్చా లేకుండానే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. వాయిస్ ఓటు ద్వారా లోక్‌సభలో పాస్ అయ్యింది. యూపీఐ సహా కొన్ని ఎలక్ట్రానిక్ పేమెంట్లపై మర్చంట్ డిస్కౌంట్ రేటును బ్యాంకులు, సర్వీసులు ప్రొవైడర్లు వసూలు




చేయకుండా ఇప్పటి వరకు చట్టపరమైన నిబంధన ఉంది. ఈ బిల్లుతో ఇది తొలగనుంది. ప్రస్తుతం RTGS, NEFT ద్వారా జరిపే రియల్ టైం లావాదేవీలపై బ్యాంకులు సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. యూపీఐ లావాదేవీలకు మాత్రం మినహాయింపు ఉంది. దీన్ని తాజాగా తొలగించారు. వినియోగదారులు, చిన్న వ్యాపారాల కోసం డిజిటల్ చెల్లింపు సేవలపై చిన్న రుసుము విధించడంతో పాటు, డిజిటల్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను నడిపించే బ్యాంకులు, చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్లు, పేమెంట్ ఇన్‌ఫ్రా సంస్థలకు ఆదాయాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో నిర్దిష్ట పరిమితి దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించే అవకాశం ఉంది. ఈ ఛార్జీలు పెద్ద వ్యాపారులకే వర్తిస్తాయి. సాధారణ వినియోగదారులకు వర్తించవు.